## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



స్వరాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ అందుతున్నది. దాంతో రైతులు ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగు చేసుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా నాలుగైదు గంటల కరెంట్, రాత్రి పూట పొలాల్లో పడిగాపులు, ఎరువులు, విత్తనాల బాధలు, ధాన్యం కొనుగోళ్ల కష్టాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల జీవితాల్లో నిప్పులు పోసేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకున్నది. 24 గంటల కరెంట్ అవసరం లేదని, 10 హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే 3 గంటలు చాలని అంటున్నది. దీనిపై రైతులు భగ్గుమంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లకు అయ్యే ఖర్చు ఎవడిస్తడని నిలదీస్తున్నారు. నాడు కాంగ్రెస్ పాలనలో రాత్రిపూట కరెంటు కోసం పడిగాపులు కాసి కరెంట్ షాక్, పాము, తేలు కాట్లతో ఎంతో మంది రైతులు చనిపోయిన ఘటనలు ఇంకా మర్చిపోలేదని దుమ్మెత్తిపోస్తున్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను కచ్చితంగా ఓడిస్తామని స్పష్టం చేస్తున్నారు.



# 10 హెచ్‌పీ మోటర్లకు పైసలెవడిస్తడు..?

## వ్యవసాయంపై కాంగ్రెస్ కుట్రలపై భగ్గుమంటున్న రైతులు



### కాంగ్రెస్ వస్తే కరెంట్‌కు కష్టాలె..

కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక కరెంటు కష్టాలు పూర్తిగా తొలగినయ్. గతంలో తిండీతిప్పలు మానేసి రాత్రనక, పగలనక పొలం గట్ల మీదనే జాగారం చేసేటోళ్లం. కరెంటు ఎప్పుడొస్తదో, ఎప్పుడు పోతదో దేవునికే ఎరుక. ఒకవేళ వచ్చినా మడి తడవక ముందే మళ్లీ పోయేది. ఇప్పుడు ఆ బాధలు అసలే లేవు. కరెంటు మంచిగుంటుంది. కోతలు లేకపోవడం వల్ల పుష్కలంగా నీళ్లు పారి పంటలు బాగా పండుతున్నాయి. మళ్లా కాంగ్రెసోళ్లు ఊళ్లమీదికి వచ్చి మూడు గంటలు, 10 హెచ్‌పీ మోటర్లని అక్కరకు రాని, అర్థంలేని ముచ్చట్లు చానా చెప్తుండ్రు. ఆ మోసగాళ్ల మాటలు నమ్మేదే లేదు. వాళ్లు అధికారంలోకి వస్తే కరెంటు కష్టాలు తప్పవు. మళ్లీ కేసీఆర్ పాలనే రావాలె. ఆయనకే మా ఓటు.

**– వాయిటి పెద్ద వెంకన్న, బూరుగడ్డ, హుజూర్‌నగర్ మండలం**



### 3గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ వద్దు

ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నరు. దాంతో ఒక మడి కూడా తడవదు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే ఇప్పుడున్న వాటిని తీసేసి కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. దానివల్ల ఒక్కో రైతుపై ఎంత భారం పడుతుందో ఆలోచించాలి. ఇవన్ని చేసినా పంటలు పండే పరిస్థితి లేదు. అందుకే ఎవరూ కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు. వారికి మాటలెక్కువ.. చేతలు తక్కువ. అందుకే వాళ్లు వద్దు. మూడు గంటల కరెంట్ వద్దు. ఇప్పుడున్న ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నది. దీంతో బోర్లు, బావుల ద్వారా ఎటువంటి ఇబ్బంది లేకుండా పంటలు పండించుకుంటున్నం. పంటను సైతం ఎటువంటి సమస్య లేకుండా మంచి రేటుకు అమ్ముకోగలుగుతున్నం. కాబట్టి రైతులందరం ఎవరు మేలు చేస్తారనేది ఆలోచించి ఓటేద్దాం.

**– యల్లావుల గురుమూర్తి, రైతు, కాల్వపల్లి, గరిడేపల్లి మండలం**



### 3గంటల కరెంటుతో రైతులకు ముప్పే

10హెచ్‌పీ మోటరుతో మూడు గంటల్లో పొలాలకు నీరు పెట్టవచ్చని చెప్పడం రేవంత్‌రెడ్డి తెలివితక్కువతనం. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోసం చాలా కష్టపడ్డాం. రాత్రిపూట పొలాల వద్ద పడిగాపులు కాసినం. కరెంటు గురించి కాంగ్రెసోళ్లకు మాట్లాడే అర్హత లేదు. సీఎం కేసీఆర్ 24గంటలు కరెంటు ఇస్తుంటే ఇబ్బందులన్నీ పోయాయి. ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటున్నం. మూడు గంటల కరెంటుతో ముప్పే తప్ప.. రైతులకు ఒరిగేదేం లేదు. కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాల కోసం గోస పడ్డాం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రైతులకు మేలు చేసే ప్రభుత్వాలు కావాలే తప్ప.. గోస పెట్టే ప్రభుత్వాలు మాకొద్దు.

**– రమావత్ భీమ్లానాయక్, జగన్నాథతండా, నేరేడుచర్ల మండలం**

### కాంగ్రెస్ వస్తే సాగు వదిలి వలస పోవాల్సిందే..



కాంగ్రెసోళ్లు సోయి లేకుండా మాట్లాడుతున్నారు. బోరు, బావులకు 10హెచ్‌పీ మోటర్లు ఎలా పెట్టుకుంటారు. అంత పెద్ద మోటర్లు పెడితే భూగర్భ జలాలు అందుతయా? వ్యవసాయంపై అవగాహన లేని వారికి పాలన అప్పగిస్తే ఇంకా మా పని అయిపోయినట్లే. 3గంటల కరెంట్, 10హెచ్‌పీ మోటరుతో మళ్లీ రైతులు వ్యవసాయాన్ని వదిలి వలసలు పోవాల్సి వస్తది. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక నానా ఇబ్బందులు పడ్డాం. లోవోల్టేజీతో మోటర్లు, ఫీజులు కాలిపోయేవి. మోటర్లు రిపేరు చేయడానికి రెండు మూడు రోజులు పట్టేది. కరెంట్ ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతదో తెల్వక రాత్రిపూట మోటర్లు పెట్టడానికి నానా అవస్థలు పడ్డాం. కరెంట్ సమస్యతో పంటలకు సరిపడా నీళ్లు అందక పంట నష్టపోయే వాళ్లం. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చాక 24గంటల కరెంటు ఇస్తుండడంతో పంటలు పుష్కలంగా పండుతున్నాయి. వ్యవసాయంపై అవగాహన లేని కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టాలి.

**– నంద్యాల కృష్ణారెడ్డి, రైతు, నంద్యాలవారిగూడెం, ఆత్మకూర్.ఎస్**



### మూడు గంటలెట్ల సరిపోతది

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఇస్తామని చెప్తున్నారు. వాళ్లిచ్చే మూడు గంటల కరెంటుతో ఒక్క మడి కూడా తడవదు. వ్యవసాయం ఎట్ల చేస్తరు? కాంగ్రెస్ నాయకులు వచ్చి పంట పండిస్తే తెలుస్తది. నోటికి ఏది వస్తే అది మాట్లాడి అధికారంలోకి వచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేద్దామనుకుంటున్నారు. అలా చేస్తే తిరగబడడం ఖాయం. బీఆర్ఎస్ సర్కార్ 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నది. దీంతో హాయిగా రెండు పంటలు పండిస్తున్నాం. రైతులు మంచిగా ఉండాలంటే కేసీఆరే ముఖ్యమంత్రి కావాలి.

**– మన్నెం నర్సిరెడ్డి, రైతు, మఠంపల్లి**